సర్కారు కొమ్ములు వంచిన లంబాడీలు

- ఎల్‌హెచ్‌పీఎస్ పోరాటంతో దిగివచ్చిన సర్కార్
- గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను కొట్టేయాలి
- ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): పచ్చటి పొలాల్లో ఫార్మా విలేజ్ ఏర్పాటుకు వ్యతిరేకంగా లంబాడీలు చేసిన పోరాటం ఫలించిందని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ అన్నారు. ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కుట్రలు, కుతంత్రాలతో లంబాడీ రైతులపై కేసులు పెట్టి భూములు లాక్కోవాలని చూసిన కాంగ్రెస్ సర్కార్ పాచిక పారలేదని చెప్పారు. ఎన్ని వేధింపులకు పాల్పడినా ఎదురు నిలిచిన లంబాడీ మహిళల పోరాటం ఫలించిందని అన్నారు. రేవంత్ సర్కార్ ఫార్మా విలేజీకి భూసేకరణ రద్దు చేయడం వెనుక లంబాడీ మహిళల పోరాటం కీలకమైందని అన్నారు. లగచర్ల లంబాడీల పోరాటానికి మద్దతుగా నిలిచి భరోసా కల్పించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. భూసేకరణ రద్దుతో పాటు అమాయక గిరిజనులపై పెట్టిన అక్రమ కేసులను కొట్టేయాలని డిమాండ్ చేశారు. జైళ్లలో మగ్గుతున్న గిరిజన రైతులను వెంటనే విడుదల చేయాలని, తండాల్లో 144 సెక్షన్ ఎత్తేయాలని కోరారు.

రాష్ట్ర పండుగగా 'ప్రజా విజయోత్సవాలు'

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నవంబర్ 29 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా నిర్వహించనున్న 'ప్రజాపాలన –ప్రజా విజయోత్సవాలు' కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీఎస్ శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. డిసెంబర్ 1 నుంచి 9వ తేదీ వరకు జిల్లాల్లో కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. మండల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రణాళిక రూపొందించాలని, ప్రజలు, నాయకులు, ప్రజాప్రతినిధులను భాగస్వాముల చేయాలని తెలిపారు.

ఖమ్మం కాంగ్రెస్‌లో టగ్‌ఆఫ్ వార్!

- వలస, అసలు కాంగ్రెస్‌గా విడిపోయిన నేతలు
- మంత్రుల మధ్య పూడ్చలేని అగాధం
- వారి మధ్య విభేదాలతో అభివృద్ధి ఆగం
- తలలు పట్టుకుంటున్న ద్వితీయ శ్రేణి నేతలు



హైదరాబాద్, నవంబర్29(నమస్తే తెలంగాణ): ఖమ్మం జిల్లాలో అసలు కాంగ్రెస్, వలస కాంగ్రెస్ బ్యాచ్‌ల మధ్య ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరిందని, వీరి గొడవలతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అభివృద్ధి మూలనపడిందని పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఆందోళన చెందుతున్నది. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏవరూ ఊహించని విధంగా ఒక్క ఖమ్మం జిల్లాకే మూడు మంత్రి పదవులు దక్కాయి. ముగ్గురూ కలిసి జిల్లాను గొప్పగా అభివృద్ధి చేస్తారని ప్రజలు భావించారు. అయితే, అభివృద్ధి మాట అటుంచి, నేతల మధ్య సర్దుబాటు చేయలేనంత అంతరం ఏర్పడిందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీతారామ సాగర్ మినహా..

ముగ్గురు మంత్రులు మూడు ప్రాంతాలపై దృష్టి పెట్టి తలా ఓ పని చేపట్టినా జిల్లా ఇప్పటికే కండ్లు చెదిరే స్థాయిలో అభివృద్ధి చెంది ఉండేదని చెప్తున్నారు. మంత్రులకు క్యాంపు కార్యాలయాలపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ 99 శాతం పూర్తి చేసిన సీతారామ ప్రాజెక్టుకు పైపై మెరుగులు దిద్ది 100 శాతం పూర్తి చేసినట్టు చెప్పుకుంటున్నారని, ఇది తప్పితే చెప్పుకునేందుకు ఏమీ లేదని విమర్శిస్తున్నారు. వలస కాంగ్రెస్ నేతలు.. వలస కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులకు, అసలు కాంగ్రెస్ నేత.. అసలు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు మాత్రమే అపాయిమెంట్స్ ఇస్తున్నారని, ఉమ్మడిగా కలిపి ఫ్లెక్సీలు కూడా వేసుకునే పరిస్థితి లేకుండా పోయిందని అంటున్నారు. ఖమ్మం పట్టణంలో ముగ్గురు మంత్రులు మూడు క్యాంపులు పెట్టుకొని వ్యవహారాలు చక్కదిద్దుకుంటున్నారని, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఆరోపిస్తున్నారు.

నామినేటెడ్ పోస్టులు బంధువులకేనట

ఉమ్మడి జిల్లాలో చిన్నా పెద్దా నామినేటెడ్ పదవులు 125 నుంచి 150 వరకు ఉన్నాయి. ముగ్గురు నేతల మధ్య ఆధిపత్య పోరు కారణంగా ఇవి భర్తీ కావడం లేదు. దీంతో దిగువ శ్రేణి నాయకత్వంలో ఆవేదన కనిపిస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో భద్రాచలం రామయ్య ఆలయాన్ని ప్రత్యేక అధికారితోనే అభివృద్ధి చేసి, దేవాలయ కార్యకలాపాలు నిర్వహించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేవస్థానానికి ప్రత్యేక బోర్డు నియమిస్తామని హామీ ఇచ్చారు. దీంతో నేతలు చైర్మన్ పదవి మీద, బోర్డు సభ్యుల పదవుల మీద ఆశలు పెట్టుకున్నారు. భద్రాచలంతో పాటు మరో 16 దేవస్థానాలు ఉన్నాయి. వీటికి కూడా ఇప్పటి వరకు పాలక బోర్డులు లేవు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 వ్యవసాయ మార్కెట్లు ఉన్నాయి. వీటిలో ఖమ్మం మార్కెట్ అతి పెద్దది. మార్కెట్ కమిటీల పాలక మండళ్ల కార్యవర్గాన్ని నియమిస్తారని మూడు నెలలుగా ప్రచారం జరుగుతున్నది. కానీ ఇప్పటి వరకు అడుగు ముందుకు పడలేదని కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో మూడు నియోజకవర్గాలకు పరిమితమైన సుడా(స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)ను కాంగ్రెస్ ప్రభుత్వం 5 నియోజకవర్గాలకు విస్తరించింది. సుడా చైర్మన్ పదవి మీద పార్టీ ద్వితీయ శ్రేణి నాయకత్వం ఆశలు పెట్టుకున్నది. కీలకమైన భద్రాచలం ట్రస్టు బోర్డు, సుడా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను మగ్గురు మంత్రులు తమ బంధుగణానికి ఇవ్వాలని పట్టుబడుతుండటంతో ఇవి వాయిదా పడుతూ వస్తున్నాయని జిల్లా నాయకత్వం ఆవేదన వ్యక్తం చేస్తున్నది. పార్టీ జెండాలు మోసి, వారిని గెలిపించేందుకు తాము కావాలని కానీ, పదవుల పంపకాలకు వచ్చేసరికి బంధువులకు కట్టబెట్టాలని చూస్తున్నారని పార్టీ సీనియర్ కార్యకర్త ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.

మండల నేతకు కనీస గౌరవం లేక..

ఖమ్మం జిల్లాలో నేతల మధ్య గ్రూప్ రాజకీయాలు మొదటి నుంచి ఉన్నాయని, అందరం కలిసికట్టుగా పని చేసి పార్టీని గెలిపించామని కార్యకర్తలు చెప్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 10 నియోజక వర్గాలు ఉంటే 9 నియోజక వర్గాల్లో కాంగ్రెస్ పార్టీని గెలపించామని అంటున్నారు. ముగ్గురు మంత్రులూ వారి బంధువులకు, రక్త సంబంధికులేకే అధికార పెత్తనాన్ని అప్పగించారని ఖమ్మం పట్టణానికి చెందిన దిగువ శ్రేణి నాయకుడు 'నమస్తే తెలంగాణ' వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఇక, అధికారులు విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ముగ్గురు మంత్రులు జిల్లాలో ఉన్నప్పుడు ఎవరి ప్రొటోకాల్ ప్రకారం విధులు నిర్వర్తించాలో తెలియడం లేదని తలలు పట్టుకుంటున్నారు.

'లగచర్ల' భూములు లాక్కునుడు పక్కా!

మొదటిపేజీ తరువాయి...

కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల, పోలేపల్లి గ్రామాల్లో 'మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్' ఏర్పాటు చేయనున్నారు. భూసేకరణ కోసం ప్రత్యేక అధికారిగా తాండూర్ సబ్ కలెక్టర్‌ను నియమించారు. భూ సేకరణకు సంబంధించిన నోటిఫికేషన్‌ను జిల్లా కలెక్టర్ విడుదల చేయనున్నారు. ఫార్మా విలేజ్ కోసం గతంలో లగచర్లలో 632.25 ఎకరాలు, పోలేపల్లిలో 72 ఎకరాలు కలిపి మొత్తం 704.25 ఎకరాలను సేకరించాలని ప్రభుత్వం భావించింది. ఇప్పుడు ఇండస్ట్రియల్ పార్కు కోసం ఏ మేరకు భూములను సేకరిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది.

హకీంపేటలో ఫార్మా విలేజ్ ఉన్నట్టేనా?

కొడంగల్‌లో ఫార్మా విలేజ్ ఏర్పాటు చేయాలని టీజీఐఐసీ ఈ ఏడాది జూన్‌లో నిర్ణయించింది. ఈ మేరకు దుద్యాల మండలంలోని హకీంపేట, పోలేపల్లి, లగచర్లలో కలిపి 1358.37 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. ఆగస్టులో భూ సేకరణ నోటిఫికేషన్ జారీ చేసింది. లగచర్లలో రైతుల పోరాటం నేపథ్యంలో ప్రభుత్వం లగచర్ల, పోలేపల్లిలో ఫార్మా విలేజ్ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకటించింది. అంటే, హకీంపేటలో ఫార్మా విలేజ్ కొనసాగుతుందా? అన్న అనుమానాలు మొదలవుతున్నాయి. మొత్తం 1358.37 ఎకరాల్లో 704.25 ఎకరాలను మాత్రమే మినహాయించారు. మిగతా హకీంపేటలోని 654.12 ఎకరాల్లో ఫార్మా విలేజ్ కొనసాగుతుందా? అన్న చర్చ జరుగుతున్నది.

రైతుల పోరాటం మట్టిపాలేనా?

లగచర్లలో రైతులు భూసేకరణను అడ్డుకున్నది, అధికారులపై కొందరు దాడి చేసింది తమ భూములు పోతున్నాయన్న ఆవేదనతోనే అన్నది అక్షర సత్యం. ఈ క్రమంలో ప్రభుత్వం దీనికి రాజకీయ రంగు పులిమేందుకు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అనుచరుల పేర్లను తెరమీదికి తెచ్చి, ఆయనను అరెస్ట్ చేసింది. ఏ తప్పూ చేయకపోయినా ఆయనను జైలులోనే కొనసాగిస్తున్నది. మరోవైపు అర్ధరాత్రి పోలీసులు లగచర్ల గ్రామంపై దాడి చేసి, ఇండ్లల్లోకి బలవంతంగా దూరి రైతులను అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రైతుల భార్యలు, ఇతర కుటుంబ సభ్యులు హైదరాబాద్ వరకు వచ్చి తమ నిరసనను తెలియజేశారు. ఢిల్లీ వరకు వెళ్లి మానవ హక్కుల సంఘాలను, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. తమకు వ్యవసాయం తప్ప మరేమీ తెలియదని, తమ పొలాలను ప్రభుత్వం గుంజుకోవద్దని ప్రాధేయపడ్డారు. చావడానికైనా సిద్ధమే తప్ప భూములు ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. రైతుల పోరాటానికి బీఆర్ఎస్ అండగా నిలిచింది. ఈ పోరాటాల ఫలితంగా ప్రభుత్వం దిగివచ్చింది. ఫార్మా విలేజ్‌ల నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకున్నది. దీంతో రైతులు సంబురపడేలోగా 'మల్టీపర్పస్ ఇండస్ట్రియల్ పార్క్'ను తెరమీదికి తెచ్చింది. దీంతో తాము ఇన్నాళ్లుగా చేసిన పోరాటం వృథానేనా? అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'లగచర్ల' ఫార్మా గ్రామాల భూసేకరణ రద్దు

వికారాబాద్ జిల్లా లగచర్లలో ఫార్మా విలేజ ఏర్పాటు ప్రతిపాదన నుంచి ప్రభుత్వం వెనక్కు తగ్గింది. ఫార్మా కంపెనీల కోసం తలపెట్టిన భూసేకరణ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకున్నది. ఈ మేరకు జిల్లా కలెక్టర్ తాజాగా నోటిఫికేషన్ జారీ చేశారు. మొత్తం 580 మంది రైతులకు చెందిన 632 ఎకరాల భూమిని సేకరించేందుకు గతంలో నోటిఫికేషన్ ఇవ్వగా రైతుల పోరాటం నేపథ్యంలో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

ఒకే ఘటనపై మూడు ఎఫ్ఐఆర్‌లు ఎందుకు?

మొదటిపేజీ తరువాయి...

ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎందులోనూ నరేందర్‌రెడ్డి పేరు లేకపోవడం, సంఘటన జరిగినప్పుడు ఆయన భౌతికంగా ఉన్నాడనో, స్వయంగా దాడులకు పాల్పడాడనో ఫిర్యాదుల్లో పేర్కొనలేదని గుర్తుచేసింది. కేవలం కుట్రపన్నారన్న ఆరోపణలపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడాన్ని పరిశీలిస్తే నరేందర్‌రెడ్డిని ఈ కేసులో ఇరికించాలని చూస్తున్నట్టుగా ఉన్నదని వ్యాఖ్యానించింది. ఒకే ప్రదేశంలో, ఒకే సమయంలో జరిగిన ఒకే ఘటనకు సంబంధించి మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చట్ట వ్యతిరేకమని స్పష్టం చేసింది. రెండు ఎఫ్ఐఆర్‌లను కొట్టివేస్తూ శుక్రవారం జస్టిస్ కే లక్ష్మణ్ తీర్పు వెలువరించారు.

మూడు ఫిర్యాదులు ఎందుకు?

బొమ్రూరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో తనపై మూడు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయడాన్ని సవాల్ చేస్తూ పట్నం నరేందర్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ కే లక్ష్మణ్ తీర్పును వెలువరించారు. ఒకే చోట, ఒకే సమయంలో ఏదైనా సంఘటన జరిగితే వేర్వేరు కేసులను ఎలా నమోదు చేస్తారని పోలీసులను ప్రశ్నించారు. 'ఒక ఘటనపై ఒక ఎఫ్ఐఆర్‌ను మాత్రమే నమోదు చేయాలి. ఒకవేళ తొలి ఎఫ్ఐఆర్‌లో తప్పులు, పొరపాట్లు ఉంటే ఆ లోపాలను సరిదిద్దేందుకు, కొత్త విషయాలు ఉంటేనే మరో ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి వీలుంటుంది. అవే ఆరోపణలతో మళ్లీమళ్లీ ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం చట్ట వ్యతిరేకం' అని స్పష్టం చేశారు. బీఎన్ఎస్ఎస్ చట్ట నిబంధనల ప్రకారం, టీటీ అంటోనీ వర్సెస్ కేరళ రాష్ట్రం మధ్య జరిగిన కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం ఒకే ఘటనపై మూడు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడానికి వీల్లేదని పేర్కొన్నారు. వికారాబాద్ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ ఫిర్యాదు మేరకు బొమ్రూస్‌పేట పీఎస్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ 153/2024 మాత్రమే చెల్లుతుందని చెప్పారు. దుద్యాల ఎమ్మార్వో కర్రకిషన్, వికారాబాద్ డీఎస్పీ బీ జానయ్య ఇచ్చిన ఫిర్యాదుల మేరకు ఎఫ్ఐఆర్‌లు 154, 155 చెల్లవని చెప్పారు.

ఉన్నతాధికారులు రాసివ్వలేరా?

మూడు ఫిర్యాదులలో ఏ ఒక్క దానిలోనూ పట్నం నరేందర్‌రెడ్డి పేరు లేదని ధర్మాసనం పేర్కొన్నది. ఆయన భౌతికంగా ఘటనాస్థలంలో ఉన్నట్టుగానీ, స్వయంగా దాడులకు పాల్పడినట్లుగానీ ఫిర్యాదుల్లో లేదని తెలిపింది. మూడు నేరాల్లో నిందితులపై మోపిన ఆరోపణలు వేర్వేరుగా ఉన్నాయనే ప్రభుత్వ వాదన చట్ట వ్యతిరేకమని పేర్కొంది. ఘటన జరిగిన ప్రదేశం ఒకటే అయినా బాధితులు, నిందితులు వేర్వేరని, నేరాలు కూడా భిన్నంగా ఉన్నాయని, ఈ కేసుల వెనుక రాజకీయ దురుద్దేశం లేదని, పిటిషనర్‌పై వచ్చిన ఆరోపణలు తీవ్రమైనవని ప్రభుత్వం చేసిన వాదనను తోసిపుచ్చింది. అధికారులు స్వయంగా ఫిర్యాదును ఎందుకు రాసివ్వలేదన్న ప్రశ్నకు అదనపు అడ్వకేట్ జనరల్ (ఏఏజీ) ఇచ్చిన వివరణను హైకోర్టు తప్పుబట్టింది. 'ఫిర్యాదు చేసిన ఎమ్మార్వో, డీసీఆర్బీ, డీఎస్పీ ఉన్నత స్థాయిలో ఉన్న బాధ్యత గల అధికారులు. ఉన్నత చదువులు చదివినవారు. వాళ్లు స్వయంగా ఫిర్యాదులు రాసి ఇవ్వలేదు. పోలీస్ స్టేషన్‌లో రైటర్ రాసిన ఫిర్యాదులపై ఇద్దరు అధికారులు సంతకాలు చేశారు. ప్రభుత్వం తరపున ఏఏజీ చేసిన వాదన ఆమోదయోగ్యంగా లేదు. కలెక్టరపై దాడి సంఘటనతో ఇద్దరు అధికారులు షాక్‌కు గురై ఫిర్యాదును రాసే పరిస్థితిలో లేరని ఏఏజీ చెప్పడం సబబు కాదు' అని న్యాయమూర్తి పేర్కొన్నారు. 'కేసు పూర్వపరాలను, ఫిర్యాదుల్లోని విషయాలను, వాస్తవాలను పరిశీలిస్తే పట్నం నరేందర్‌రెడ్డిని కేసులో ఇరికించాలని చూస్తున్నట్టు గా ఉన్నది' అని వ్యాఖ్యానించారు. కాబట్టి రెండు ఫిర్యాదులను (154, 155)లను కొట్టివేస్తున్నామని తీర్పునిచ్చారు. దుద్యాల తాసిల్దార్, వికారాబాద్ డీఎస్పీ వాంగ్మూలాలను దర్యాప్తు అధికారి రికార్డు చేయవచ్చని, వాంగ్మూలాలను రికార్డు చేస్తే వాటిని ఎఫ్ఐఆర్ 153/2024లో భాగంగా పరిగణించాలని స్పష్టం చేశారు.